# నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్

5 | నిజామాబాద్, మంగళవారం 12 మార్చి 2024 | ADILABAD




ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

## బాండ్ల వివరాలను వెల్లడించాలి..

**ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ధర్నా**

ఎదులాపురం, మార్చి 11 : ఎలక్ట్రోరల్ బాండ్లను రద్దు చేస్తూ ఎన్నికల బాండ్ల వివరాలను సమర్పించాలని ఎస్‌బీఐని ఆదేశించినా సుప్రీంకోర్టుకు ఇవ్వడం లేదని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనల మల్లేశ్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ గేటు ఎదుట కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. ఎస్‌బీఐ ప్రజల బ్యాంకుగా కాకుండా బీజేపీ బ్యాంకుగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను కూడా బేఖాతరు చేయడం క్షమించరాని నేరమన్నారు. బీజేపీ అన్ని వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకున్నట్లు, ఎస్‌బీఐని కూడా పెట్టుకున్నట్లు కనిపిస్తున్నదన్నారు. ఎన్నికల బాండ్లతో వేల కోట్లు వసూలు చేసిన బీజేపీ తన బండారం బయట పడుతుందన్న భయంతోనే వివరాలను వెల్లడించకుండా ఎస్‌బీఐపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు లంకా రాఘవులు, పూసం సచిన్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, నాయకులు లింగాల చిన్నన్న, జమున, కోవ శకుంతల, పోచక్క, స్వామి, ఆశన్నలు ఉన్నారు.



మద్దతు తెలుపుతున్న విద్యార్థి యువజన సంఘం జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భాస్కర్

## 56వ రోజుకు దీక్షలు

ఎదులాపురం, మార్చి 11 : ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే లైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 56వ రోజుకు చేరుకున్నది. దీక్షకు విద్యార్థి యువజన సంఘం జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మెస్రం భాస్కర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జిల్లా అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. అన్ని సౌకర్యాలు, వనరులు ఉన్న సీసీఐ పరిశ్రమ తెరిపించడంలో విఫలం అయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు సలాం వరుణ్, రాములు, రఫిక్, శ్రీనివాస్ యాదవ్, అరుణ్ జాదవ్, ఖాసీం రమేశ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి..

ఎదులాపురం, మార్చి 11 : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సోమవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ క్యాంపు కార్యాలయంలో కూడా ఎమ్మెల్యే పీఏ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందులో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి అగ్గిమల్ల స్వామి, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అడెల్లు, గంగన్న, ఇంద్రజ, సంతోష్, జిల్లా నాయకులు నగేశ్, విలాస్, సంతోష్, గంగయ్య, శంకర్, దశరథ్, తానేరావు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

నిర్మల్ టౌన్, మార్చి 11 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న కార్మికులు పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ మాట్లాడుతూ.. వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, గుడ్లు, కూరగాయల బిల్లులు కూడా ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నారని మండిపడ్డారు. అప్పుల బాధతో తిప్పలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధ, లక్ష్మి, సాయవ్వ, చంద్రకళ, రాజమణి పాల్గొన్నారు.

## కుష్ఠు రహిత సమాజమే లక్ష్యం

- ఇంటికొచ్చే వైద్య బృందాలకు సహకరించాలి..
- ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్



శరీరంపై మచ్చలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఎదులాపురం, మార్చి 11 : కుష్ఠు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జాతీయ కుష్ఠు నిర్మూలనలో భాగంగా కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం కార్యక్రమాన్ని సోమవారం చిల్కా లక్ష్మీనగర్‌లోని యూపీహెచ్‌సీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న ఇండ్లను 14 రోజులపాటు సర్వే చేస్తారని తెలిపారు. వైద్య బృందాలకు ప్రజలు సహకరించాలని కోరారు. అపోహలు అవసరం లేదని, అనుమానితులు ముందుకొచ్చి చూపించుకోవాలని కోరారు. జిల్లా కుష్ఠు నివారణ అధికారి గజానన్, వైద్యాధికారి దీపిక, డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్ రావు, ఎల్టీ రమణచారి, కో–ఆర్డినేటర్ విష్ణు పాల్గొన్నారు.




### ఎలా తిరస్కరణకు గురయ్యాయి..

వినియోగదారులకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేకపోవడం, ఉన్నా తప్పుగా ఉండడం, మీటర్ నంబర్ తప్పుగా నమోదు కావడం, మొబైల్ నంబర్ సరిగ్గా ఎంట్రీ కాకపోవడం, 200 యూనిట్లకుపైగా కరెంటును వినియోగించడం వంటి తప్పిదాల వల్ల జీరో బిల్లులు రావడం లేదు.

### ప్రస్తుతం ఏం కావాలి..

ఆధార్, రేషన్ కార్డు, కరెంట్ బిల్లు, మీటరు నంబర్, ప్రజా పాలన దరఖాస్తు రశీదులను ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా సేవా కేంద్రాల్లో సమర్పించాలి.

● 'కాంగ్రెస్' షాక్

# ఎక్కడండీ.. జీరో బిల్లు..!

### కరెంటు బిల్లులు రావడంతో ఆందోళన

**గృహలక్ష్మి కోసం విద్యుత్ వినియోదారుల బారులు**

**ఎంపీడీవో, మున్సిపాలిటీ కార్యాలయాలకు పరుగో పరుగు**

**ప్రజా సేవా కేంద్రాల్లో మళ్లీ దరఖాస్తుల సమర్పణ**

**రెండు నుంచి మూడు గంటలపాటు పడిగాపులు**

## కొందరికేనా.. అందరికా..?

*కాంగ్రెస్ సర్కారు గృహలక్ష్మి వినియోగదారులకు షాక్ ఇచ్చింది. కొందరికి జీరో బిల్లులు ఇచ్చి, మరికొందరికి రెగ్యూలర్ బిల్లులు పంపిణీ చేసింది. వచ్చిన బిల్లులు కట్టలేక వినియోగదారులు సతమతం అవుతున్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మార్చి నుంచి బిల్లులు మాఫీ చేస్తామని చెప్పిన సర్కారు.. డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి మాట తప్పింది. ప్రస్తుతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందుకోసం మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయం, పట్టణాల్లోని మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సేవా పేరిట కేంద్రాలను ఏర్పాటు చేసింది. కౌంటర్లు తక్కువగా ఉండడం, వినియోగదారులు అర్జీలు ఇవ్వడానికి అధికంగా వస్తుండడంతో క్యూలు కనిపిస్తున్నాయి. రెండు నుంచి నాలుగు గంటల వరకు నిలబడి దరఖాస్తులు సమర్పిస్తున్నారు. కొన్ని చోట్ల టెంట్లు వేసినా.. వడగాలులకు అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ జీరో బిల్లులు వస్తాయా? లేదా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.*




ఆదిలాబాద్(నమస్తే తెలంగాణ)/నిర్మల్ అర్బన్/భైంసా/ఖానాపూర్/మార్చి 11 : ఆరు గ్యారెంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నది. అర్హులైన వారికి ప్రతినెలా 200 యూనిట్ల వరకు కరెంటును ఉచితంగా సరఫరా చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఇందులో భాగంగా ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు తమ ఆధార్, రేషన్ కార్డు, కరెంటు మీటరు నంబరు, ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 1,61,366 మంది గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. గత నెలలో విద్యుత్‌శాఖ అధికారులు 200 యూనిట్ల లోపు కరెంటు వాడుతున్న వారికి ఉచితంగా సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో ఇంటింటా తిరిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆ వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గృహజ్యోతి పథకంలో భాగంగా మార్చి 1 నుంచి అర్హులైన వారికి ఉచితంగా కరెంటు అందజేస్తామని ఇందులో భాగంగా జీరో బిల్లులు పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో 200 యూనిట్ల కరెంటును వాడే వినియోగదారులు ఇప్పటి నుంచి తమకు జీరో బిల్లులు వస్తాయని ఆశించారు.

### జీరో బిల్లులు రాక పరేషాన్

మార్చి 1 నుంచి జీరో బిల్లుల పంపిణీ ప్రారంభంకాగా ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు సగం మందికిపైగా జీరో బిల్లులు రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. గృహజ్యోతి పథకంలో తప్పులను సవరించి, తిరిగి దరఖాస్తు చేయడానికి మున్సిపాలిటీ, మండల కార్యాలయాల్లో ప్రజాసేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజాపాలనలో తాము దరఖాస్తు చేసుకున్నా జీరో బిల్లులు రావడం లేదంటూ ప్రజాసేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఈ కేంద్రాల వద్ద జనం బారులు తీరుతుండడంతో రద్దీ నెలకున్నది. ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు ఉండడం వల్ల జీరో బిల్లులు రావడం లేదని అధికారులు అంటున్నారు. మీటరు నంబరు తప్పుగా రాయడం, వినియోగదారులు ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు లేకపోవడం, 200 యూనిట్లకు పైగా విద్యుత్‌ను వినియోగిం చడం లాంటి తప్పిదాల వల్ల జీరో బిల్లులు రావడం లేదని అధికారులు అంటున్నారు. అర్హులైన వారందరికీ బిల్లులు వస్తాయని, పూర్తి వివరాలతో ప్రజాసేవా కేంద్రాల్లో వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ జిల్లాలో 1.91 లక్షల మంది 200ల యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తుండగా.. వీరిలో 1.13 లక్షల మంది ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటివరకు 88,890 మంది వినియోగదారులకు జీరో బిల్లులు వచ్చాయి. అయితే జీరో బిల్లులు రాని వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. దీంతో సోమవారం రేషన్, ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, విద్యుత్ సర్వీసు కనెక్షన్ నంబరు వివరాలతో కూడిన ప్రజా పాలన దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయాల్లో అందించడానికి బారులుదీరారు. కాగా.. నిర్మల్ మున్సిపాలిటీలో జీరో బిల్లు రాని వినియోగదారులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. నిర్మల్ బల్దియాలో 42 వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 20 వేల కుటుంబాలు ఉండగా.. 25 వేలకుపైగా మీటర్లు ఉంటాయి. జీరో బిల్లు రాని వినియోగదారుల కోసం మున్సిపల్ కార్యాలయంలో రెండు కౌంటర్లు మాత్రమే ఏర్పాటు చేశారు. సోమవారం దరఖాస్తులు ఇవ్వడానికి దాదాపు 300లకుపైగా మంది తరలివచ్చారు. దరఖాస్తులు ఇవ్వడానికి రెండు నుంచి మూడు గంటలు పడుతుండడంతో కరెంటు కనెక్షన్‌దారులు అవస్థలు పడ్డారు. ఖానాపూర్ పట్టణంలోని పలు కాలనీలకు చెందిన వారికి జీరోబిల్లు రాకపోవడంతో మళ్లీ దరఖాస్తులు సమర్పించడానికి తరలి వస్తున్నారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సేవా కేంద్రం అర్జీదారులతో కిక్కిరిసి పోయింది. మున్సిపల్ సిబ్బంది అర్హులైన వారి నుంచి ఆధార్, రేషన్‌కార్డు, కరెంట్ బిల్లు, ప్రజా పాలన దరఖాస్తు రశీదులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వచ్చే నెల నుంచి గృహలక్ష్మి పథకం కింద జీరో కరెంట్ బిల్ వస్తుందని తెలుపుతున్నారు.









ఖోడద్ పాఠశాల విద్యార్థులకు ప్యాడ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## నేనూ.. సర్కారు బడిలోనే చదివా..

**బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్**

తాంసి(తలమడుగు), మార్చి 11 : నేనూ.. ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. తలమడుగు మండలంలోని ఖోడద్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం రూ. 13.50 లక్షలతో సైన్స్ ల్యాబ్ గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత ఉద్యోగాలను సాధించాలని తెలిపారు. అనంతరం పీజీ హెచ్ఎం కృష్ణకుమారి–విలాస్ గౌడ్ దంపతులు అందించిన విద్య సామాగ్రిని పదో తరగతికి పిల్లలకు అందించారు. అనంతరం సైన్స్ ల్యాబ్ గది నిర్మాణానికి భూమిని దానం చేసిన చిలుకూరి లక్ష్మణ్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంఈవో నారాయణ, హెచ్ఎం కృష్ణకుమారి, విద్యా కమిటీ చైర్మన్ పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దే..

50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ నిరుపేదలను పట్టించుకోలేదని, పదేండ్ల పాలనలోనే రాష్ట్రం అభివృద్ధిలో యావత్ భారతదేశానికే తలమానికంగా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని ఖోడద్ గ్రామంలో కల్యాణ లక్ష్మి–షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. జడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీపీ కల్యాణం లక్ష్మి, ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ రాజ్ మోహన్, మాజీ సర్పంచ్ ఆనంద్‌రావ్, బీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, రవికాంత్ యాదవ్, అభిరాంరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటరమణ, ముచ్చ రఘు, లక్ష్మిపతి, వెంకటేశ్ పాల్గొన్నారు.